క్లుప్తంగా

భవిత కేంద్రం పిల్లల తల్లిదండ్రులతో సమావేశం



చుండూరు(వేమూరు): భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగులకు తల్లిదండ్రులు పూర్తిగా సహకరించాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని మున్నంగివారిపాలెం భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల తల్లిదండ్రులు భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. భవిత కేంద్రం సిబ్బంది దివ్యాంగులకు అనేక సేవలు అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రానికి పంపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్నంగివారిపాలెం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఐఈఆర్‌పీలు కె.శివకుమారి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఫిజియో థెరపిస్టు దేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బి.అగస్టీన్ తెలిపారు. అమర్తలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. పంచాయతీ కార్మికులకు మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా రూ.21 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. టెండర్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులను కచ్చితంగా అమలు చేయాలని, ఏకరూప దుస్తులు, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వాలన్నారు. భీమా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సుకుమార్, బాబురావు, సరోజినీ, కిరణ్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బాడ్మింటన్ జట్టుకు అభినందన



నగరం: స్థానిక బాల ఏసు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల సబ్‌జూనియర్ బాల్‌బాడ్మింటన్ జట్టుకు అభినందన సభ నిర్వహించారు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టుకు బాల ఏసు స్కూల్‌లో శిక్షణ నివ్వడంతో పాఠశాలలో జట్టుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిస్టర్ సజీవ, కరస్పాండెంట్ సిస్టర్ సునా, పీఈటీ గోపి పాల్గొన్నారు.

విద్యావారధి అంశంపై వ్యాసరచన పోటీలు



వేమూరు: మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యావారధి అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలను మండల విద్యాశాఖాధికారి దేవరాజు అభినందించారు. వక్తృత్వంలో టీఎంరావు హైస్కూలుకు చెందిన ప్రణీత సాయి ప్రథమ స్థానం, యామినీలత ద్వితీయ స్థానం, వై.మౌనిక((వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్) తృతీయ స్థానం సాధించారు. వ్యాసరచన పోటీల్లో టీఎంరావు హైస్కూలుకు చెందిన షేక్ యాసినా ప్రథమ స్థానం, ఎం.అక్షయ తృతీయ స్థానం సాధించారు. సీహెచ్ స్వరూప (వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్-సూరేపల్లి) ద్వితీయ స్థానం సాధించింది.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతాహీ సేవ

తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైల్వే అధికారులు స్టేషన్ ఆవరణ, ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని 15 రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తామని, చెట్లు నాటడం, ప్లాస్టిక్ వాడకం నియంత్రణపై అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు. స్టేషన్ మేనేజర్ టీవీ రమణ పర్యవేక్షించారు.

ఇళ్ల మధ్య నీరు.. దోమల హోరు



చెట్టు కింద దళితవాడలో ఇళ్ల మధ్యలో వర్షపు నీరు



చెట్టు కింద దళితవాడలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగు నీరు

- వర్షాలకు ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీరు
- విజృంభిస్తున్న దోమలు.. వ్యాధుల బారిన పడుతున్న గ్రామస్తులు

చుండూరు(వేమూరు): గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చినపరిమి గ్రామంలో ఇళ్ల మధ్య నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు విజృంభించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని దళితవాడల్లో ఇళ్ల మధ్య నీరు నిలిచిపోయినా పంచాయతీ అధికారులు నీటిని తొలగించడం గానీ బ్లీచింగ్ చల్లించటం గానీ చేయడం లేదని వాపోతున్నారు. నీటిలో దోమలు ఉత్పత్తి కావడంతో దోమల కాటు వల్ల జ్వరాలు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఇంటిలో జ్వరాలతో వ్యాపించి బాధపడుతున్నారని వైద్యులు మెడికల్ క్యాంప్‌లు కూడా నిర్వహించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు నానో యూరియాపై అవగాహన



చదలవాడ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి ప్రేమ సాగర్



బోడపాడు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో విస్తరణాధికారి మణికంఠ



నానో యూరియా, నానో డీఏపీ ప్రాముఖ్యతను వివరిస్తున్న ఏవో మహేష్‌బాబు

వేమూరు: రైతులందరు నానో యూరియా వాడాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ అన్నారు. వేమూరు మండలంలోని చదలవాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా ఎకరానికి రెండు నుంచి నాలుగు బస్తాలు ఉపయోగించాల్సి వస్తుందని, అదే నానో యూరియా ఎకరానికి 500 గ్రాములు బాటిల్ సరిపోతుందని వివరించారు. యూరియాలో 35 శాతం నత్రజని మాత్రమే పంటకు అందుతుందని, మిగితా నత్రజని ఆవిరైపోతుందన్నారు. నానో యూరియాలో 80 శాతం నత్రజని పంటకు అందుతుందన్నారు. అందువల్ల రైతులందరు నానో యూరియాకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

అమర్తలూరు(వేమూరు): రైతు సేవ కేంద్రం ద్వారా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి మణికంఠ తెలిపారు. అమర్తలూరు మండలంలోని బోడపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు గురించి రైతులకు వివరించారు. కోడిగుడ్లు, నిమ్మ రసంతో కషాయం చేసుకుంటే పంటలకు గ్రోత్ ప్రమోటర్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం కషాయం తయారు చేసి రైతులకు చూపించారు. నానో యూరియా, నానో డీఏపీ గురించి వివరించారు. నానో యూరియా నైట్రోజన్ వినియోగ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని, మొక్కల పెరుగుదల, దిగుబడి నాణ్యతను మెరుగుపరుస్తుందని అన్నారు. రైతులందరు నానో యూరియా పిచికారీ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీమణి పూజ్య, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియా ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

రేపల్లె(చెరుకుపల్లి): నానో యూరియా, నానో డీఏపీ ప్రాముఖ్యతను రైతులు తెలుసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని అరవపల్లి, నల్లూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని వరి సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు చేసుకోవటం ద్వారా రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని పథకాలు అందుతాయన్నారు. పంట పొలాలను పరిశీలించి ఆకుముడత పురుగును గుర్తించటం జరిగిందన్నారు. ఈ పురుగు నివారణకు వేపనూనె లేదా క్లోరిఫైరిపాస్ 50 ఈసీ లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. వాతావరణం అనుకూలంగా లేనందున రైతులు అధిక మోతాదులో పురుగు మందులు వాడరాదని సూచించారు. అదే విధంగా నల్లూరు గ్రామంలో 19.8 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేయటం జరిగిందని ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సుమత్, వీఏఏ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



రేపల్లెలో నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



చెరుకుపల్లిలో బైక్ జాత నిర్వహిస్తున్న యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు



కర్లపాలెంలో యూటీఎఫ్ రణభేరి ర్యాలీ

రాష్ట్ర యూటీఎఫ్ నాయకులు హనుమంతురావు

రేపల్లె(చెరుకుపల్లి): విద్యా రంగంలో ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని రాష్ట్ర యూటీఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ వి.హనుమంతురావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్వహిస్తున్న రణభేరి కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు బుధవారం రేపల్లెలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చెయ్యాలని, అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చెయ్యాలని, 12వ పీఆర్సీని ప్రకటించి, 29 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న విజయవాడలో ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాస్, అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

పరిష్కారానికి నోచుకోని ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రణభేరి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ ఉపాధ్యాయ, సీఐటీయూ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో రేపల్లె నుంచి వచ్చిన ఉపాధ్యాయులతో చెరుకుపల్లి నుంచి బాపట్ల వరకు బైక్ జాత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రణభేరి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్రమ్‌ఘోరి, తాతా సుబ్బారావు, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, డి.వీరారెడ్డి, బి.సాంబయ్య నాయక్, ఆర్.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర విధులు తొలగించాలి

కర్లపాలెం: ఉపాధ్యాయులకు బోధనేతర విధులు తొలగించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి బైక్ ర్యాలీ బుధవారం కర్లపాలెం చేరుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు యూటీఎఫ్ నాయకత్వం, ఉపాధ్యాయుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోరాటం కొనసాగిస్తుందని హనుమంతరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బి.వి.శ్రీనివాస్, ఎం.గణపతిరెడ్డి, ఇ.పోలీస్‌రావు, పి.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



భోజన పదార్థాలు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మారీసుపేట మఠం బజారులోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. స్కూల్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. స్కూల్‌లో కిటికీలు, విద్యుత్ లేకపోవడాన్ని గమనించిన ఆమె వెంటనే వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈ సూరిబాబును ఆదేశించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి దాని నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులందరు భోజనం చేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, డీఈ ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఆకస్మిక తనిఖీ

తెనాలిరూరల్: తెనాలి హెడ్ పోస్టాఫీస్, తెనాలి డివిజనల్ కార్యాలయాన్ని విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందిస్తున్న సేవలు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. బీమా సంకల్ప్ పోస్టల్ ఇన్సూరెన్స్ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయన వెంట పోస్టల్ సూపరింటెండెంట్ జీవీ బాల సరస్వతి, ఇతర అధికారులు ఉన్నారు.

హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలికి నివాళి

భట్టిప్రోలు: హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలైన దివంగత కత్తెర లలితకుమారి 83వ జయంతిని బుధవారం భట్టిప్రోలులోని కేఎస్‌కే జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు పలువురు మాట్లాడుతూ లలిత కుమారి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కేఎస్‌కే, డిగ్రీ, బీఈడీ, టీటీసీ, కళాశాలల ప్రిన్సిపాల్స్ పి.రాజేష్ విక్టర్, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షోభంలో చేనేత పరిశ్రమ

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజి

భట్టిప్రోలు: చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుండటంతో ఉపాధి కరువైన కార్మికులు అర్ధాకలితో జీవనం సాగిస్తూ ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజి అన్నారు. రాష్ట్ర వ్యాప్త అధ్యయన యాత్ర బుధవారం బాపట్ల జిల్లాకు వస్తున్న సందర్భంగా భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలాజి మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరి సొసైటీలకు శాపంగా మారుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు కె.రామకోటేశ్వరరావు, కె.వీరమోహన్‌రావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం చేనేత సొసైటీలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో అక్టోబర్ 6, 7 తేదీలలో జరగనున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ పురస్కరించుకుని బుధవారం భట్టిప్రోలు మండలంలోని సొసైటీలోని కార్మికులకు సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. నేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ కంట్రిబ్యూషన్ వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని, నేతన్నలకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు బి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుంది



భట్టిప్రోలులో మాట్లాడుతున్న వైద్యులు మొహసీనా తాజ్ పక్కన ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్



స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో వైద్యాధికారి ఓరెనా పర్వీన్

భట్టిప్రోలు: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయిలు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌సీలలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులైన ప్రజా ప్రతినిధులు, పీహెచ్‌సీ వైద్యులు మొహసీనా తాజ్ మాట్లాడుతూ మహిళ ఆరోగ్య పరిరక్షణ, బాల్య వివాహాలు అరికట్టుట, చిన్న వయసులో గర్భధారణ వలన అనర్థాలు, మహిళలు వయస్సును బట్టి చేయించుకోవాల్సిన పరీక్షలు, వయోవృద్ధుల సంరక్షణ వంటి వివరాలను తెలియజేశారు. గర్భిణులకు అంగన్‌వాడీ కార్యకర్తలు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూరేపల్లి సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు మొహసీనా తాజ్, జి.అబ్రహం లింకన్, ఎల్.పవన్ చైతన్య, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: మహిళలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని తహసీల్దార్ షాకీర్ పాషా చెప్పారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్త్ వైద్య శిబిరాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోపీనాథ్ బాలికలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ బాలికలు, మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించి నయం చేసేందుకు ఈ వైద్య శిబిరాలు దోహదపడతాయని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరూ తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు మహిళలు అశ్రద్ధ వీడి సకాలంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించటం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఎంపీడీవో యారం వనజ, మండల పరిషత్ సూపరింటెండెంట్ రజని, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రారంభమైన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

వేమూరు: మహిళలకు ఉన్నతమైన ఆరోగ్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ విజన్‌తో దేశమంతటా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఓరెనా పర్వీన్ తెలిపారు. సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ నినాదంతో ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రుల్లో సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. గర్భిణులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. బాలికలకు యుక్త వయస్సులో వచ్చే మార్పుల గురించి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, చిన్న గురువులు, డాక్టర్ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి(వేమూరు): మహిళ ఆరోగ్యమే కుటుంబానికి ఆధారమని మండల ప్రాథమిక వైద్యాధికారి సౌమ్య అన్నారు. పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే కుటుంబానికి ఆధారమన్నారు. స్త్రీ ఆరోగ్యమే కుటుంబ భవిష్యత్తుకు పునాది అన్నారు. ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ పరీక్షలు, రక్తహీనత, బీపీ, మధుమేహ పరీక్షలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్

కర్లపాలెం: సాగు చేస్తున్న రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్ చెప్పారు. మండల పరిధిలోని దుండివారిపాలెంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంను ప్రాజెక్ట్ మేనేజర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతం లాంటి కషాయాలను వినియోగించాలని రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని చెప్పారు. వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ మాట్లాడుతూ విషతుల్యం కాని ఆహార పదార్థాలను పండించేందుకు సేంద్రియ ఎరువులు వినియోగించాలని చెప్పారు. అడిషనల్ డీపీఎం మోహన్ మాట్లాడుతూ అంతర పంటలలో భాగంగా నవధాన్యాల సాగు వలన భూమి కప్పబడి ఉండి సేంద్రియ కర్బనం పెరుగుతుందని ఇది పంటలకు మేలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఈవో ఎండీ గౌస్‌బాషా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీకాంత్, వరదానమ్మ, లక్ష్మి ప్రసన్న, రైతులు ఉన్నారు.

భట్టిప్రోలులో విశ్వకర్మ జయంతి

భట్టిప్రోలు: ఏపీ కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలులో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వకర్మ పూజ అనేది ప్రపంచ రూపకర్తగా పరిగణించబడే విశ్వకర్మకు అంకితం చేయబడినట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న చేతివృత్తుల వారికి ముఖ్యమైన పర్వదినమని పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన క్రాప రవికుమార్ ఆధ్వర్యంలో కూడా బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వకర్మను పూలతో అభిషేకించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.